క్లుప్తంగా

ప్రభుత్వ స్థల ఆక్రమణకు కార్పొరేటర్ అడ్డుకట్ట



కబ్జాకు గురైన స్థలాన్ని అధికారులకు చూపుతున్న కార్పొరేటర్ వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ పరిధి 51వ వార్డులో ప్రభుత్వ స్థలం కబ్జాను స్థానికులు అడ్డుకుని, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్థలాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకున్నారు. వార్డులోని గాంధీనగర్ గెడ్డను ఆనుకుని సర్వే నెం.9/2, 9/4లలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నించారు. దీన్ని గమనించిన స్థానికులు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణకు తెలిపారు. ఆయన గోపాలపట్నం తహసీల్దార్‌కు సమాచారం అందించారు. సంబంధిత అధికారులు, సర్వేయర్లను స్థలం వద్దకు పంపించారు. గ్రేడ్ -1 వీఆర్వో, 290 సచివాలయ వీఆర్వోలు సర్వే చేశారు. ఆ స్థలం కబ్జాకు గురవకుండా, కంచె వేయాలని స్థానికులు కోరుతున్నారు.

రేపటి నుంచి వారాహి నవరాత్రి మహోత్సవాలు



లలితాపీఠంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతి

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో ఈ నెల 26 నుంచి జూలై 4 వరకు వారాహి నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన కర పత్రాలను పీఠంలోని వారాహిదేవి సన్నిధిలో పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం 4:30 గంటలకు అమ్మవారికి క్షీరాభిషేకం, సాయంత్రం 7కు సహస్రనామార్చన, చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఈ నెల 29(ఆదివారం)న వారాహి హోమం చేయనున్నట్లు వెల్లడించారు. నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొనాలనుకునే భక్తులు, అమ్మవారికి చీర ధరింపదలచిన వారు, ప్రసాద వితరణలో పాల్గొనదలచిన వారు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన సమాచార శాఖ డీడీ



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సమాచార శాఖ డీడీ సదారావు

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖ కార్యాలయ ఉప సంచాలకులుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె. సదారావు మంగళవారం కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, జర్నలిస్టుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, అక్రిడిటేషన్ల వ్యవహారాలు, ఇతర అంశాల్లో అనుసరించాల్సిన విధానాలపై సదారావుకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. సమన్వయంతో వ్యవహరించాలని, స్నేహపూర్వక వాతావరణంలో పని చేసుకోవాలని సూచించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం వైభవంగా అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 వరకు జరిగిన కార్యక్రమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆలయ కార్య నిర్వహణాధికారి కె. శోభారాణి, సహాయ కార్య నిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది హాజరయ్యారు.

హోటళ్ల వ్యర్థాలతో అనర్థాలు!

హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ నిర్వాహకుల నిర్లక్ష్యం పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. ఇక్కడ పోగయ్యే వ్యర్థాలను నేరుగా కాలువలు, డ్రైనేజీల్లో రాత్రి వేళల్లో పారబోస్తున్నారు. మురుగు ప్రవాహానికి ఆటంకంగా మారి, వర్షం కురిస్తే ముంపు సమస్య తలెత్తుతోంది. ఇలాంటి యాజమాన్యాలపై జీవీఎంసీ అధికారులు చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. 54వ వార్డు పరిధిలో నెలకొన్న అపారిశుధ్య వాతావరణం చూస్తే చాలు.. అధికారుల తీరు ఎలా ఉందో.. తేటతెల్లమవుతుంది.

- వీధి కాలువలు దుర్గంధం
- కాలువల్లో పారేస్తున్న వేస్ట్ ఫుడ్
- చూసీచూడనట్లు శానిటరీ అధికారులు
- వీధుల్లో ఉండలేకపోతున్న స్థానికులు



మద్రిపాలెం మహారాణివీధి ప్రధాన రహదారిలో హోటళ్లు



మహారాణివీధి కాలువల్లో మిగులు వ్యర్థాలు ఇలా...

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా పరిధి మహారాణివీధి, జ్యోతినగర్ ప్రాంతాల్లోని హోటళ్లు, క్యాటరింగ్ నిర్వాహకులు విడుదల చేస్తున్న వ్యర్థాలతో జనాలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్ల మీద వదిలేసిన చెత్తాచెదారంతో పరిసరాలు దుర్గంధ భరితంగా మారుతున్నాయి. ఆ హోటళ్ల వెనుకనున్న వీధుల్లో నివాసులు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. వ్యర్థాలు కాలువల్లో పారేస్తుండటంతో వీధి కుక్కలు చేరి అటుగా నడిచే పాదచారులను భయానికి గురిచేస్తున్నాయని వాపోతున్నారు.

కాలువలు దుర్గంధభరితం

మా వీధి కాలువల్లో వ్యర్థాలు నిత్యం పేరుకుపోతున్నాయి. హోటళ్లు, క్యాటరింగ్ సెంటర్ల మిగులు వ్యర్థాలతో దుర్గంధం వ్యాపించి, ఇళ్లలో ఉండలేకపోతున్నాం. తలుపులు, కిటికీలు వేసుకున్నా ఆ కంపు తప్పట్లేదు. శానిటరీ సిబ్బందికి ఫిర్యాదు చేస్తే యజమానుల నుంచి చలానా కట్టించుకున్నామనే సమాధానం చెబుతున్నారు.
– ఎస్.లక్ష్మీకాంతం, మహారాణివీధి, మద్రిపాలెం

అధికారులు స్పందించాలి

వార్డుల్లో శిథిలావస్థలో ఉన్న కాలువలు, నిలిచిపోతున్న వ్యర్థాలు, చెత్తాచెదారంపై ప్రజలకు, దుకాణాల యాజమానులకు అవగాహన కల్పించాలి. ఫిర్యాదులు చేస్తే సచివాలయ కార్యదర్శులు దురుసుగా సమాధానం చెబుతున్నారు. ఉన్నతాధికారులు వార్డులో పర్యటించి సమస్యలను పరిష్కరించాలి.
– ఎస్.ఆర్.కృష్ణారావు, జ్యోతినగర్, 104ఏరియా

ఇళ్లలో ఉన్నా.. ముక్కు మూసుకోవాల్సిందే..!

హోటళ్లు, క్యాటరింగ్ నిర్వాహకులు వ్యర్థాలు, మిగిలి పోయిన, పాడైన ఆహారపదార్థాలను డస్ట్‌బిన్లలో దాచి ఉంచి, రాత్రి వేళల్లో కాలువలు, సమీప గెడ్డల్లో పారేస్తున్నారు. ఇవి మురుగు ప్రవాహానికి అడ్డంకిగా మారడంతోపాటు, అక్కడే రోజుల తరబడి నిలిచి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇళ్లలో ఉన్నా.. ముక్కు మూసుకోవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. వర్షాలు పడేటప్పుడు మురుగు రోడ్లపైకి చేరి పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది కూడా సక్రమంగా కాలువలు ఊడ్చకపోవడంతో ఎక్కడికక్కడ పూడుకుపోయాయి.

శిథిలావస్థలో కాలువలు, డ్రైనేజీలు

ఇక్కడి చాలా వీధుల్లో కాలువలు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరాయి. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడంతో వాటి పునరుద్ధరణకు కనీస చర్యలు కూడా లేవు. ఇలాంటి కాలువలు, డ్రైనేజీల్లో చెత్తాచెదారం శుభ్రం చేయడానికి ఇబ్బందిగా ఉన్నట్లు పారిశుధ్య కార్మికులు ఆరోపిస్తున్నారు.



ప్రధాన రహదారుల్లో చిరు దుకాణాల వద్ద పారబోసిన అయిల్



జ్యోతినగర్ గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు



శిథిలావస్థలో డ్రైనేజీలు

ప్రధాన రహదారుల్లోనూ, హోటళ్ల ముందు వంటలకు వినియోగించగా బాగా నల్లగా మారిన, వ్యర్థ నూనెల్ని రోడ్లపై పారబోస్తున్నారు. వర్షాలు పడేటప్పుడు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. జోన్-5 పబ్లిక్‌హెల్త్ అధికారులకు, సచివాలయ శానిటరీ కార్యదర్శులకు ఫిర్యాదులు చేసినా.. పట్టించుకున్న దాఖలాల్లేవని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జోనల్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు వార్డులో పర్యటించి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పక్కాగా అమలు చేయాలి



గాంధీనగర్ అంగన్‌వాడీలో మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కేవీ రామలక్ష్మి

మురళీనగర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ-స్కూల్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కే.వీ. రామలక్ష్మి స్పష్టం చేశారు. మంగళవారం ఆమె విశాఖ అర్బన్ పరిధిలోని మద్రిపాలెం సెక్టార్‌లో ఉన్న పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన రామలక్ష్మి, అంగన్‌వాడీల పనితీరుపై చిన్నారుల తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీలలోని రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రంలో చిన్నారుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు లేవని గుర్తించిన ఆమె, త్వరితగతిన వాటిని నిర్మించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. తనిఖీల్లో ఆమె వెంట ఐసీడీఎస్ మద్రిపాలెం సెక్టార్ సూపర్ వైజర్ జె.టి.ఎస్. జ్యోతి, పోషణ్ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

29న విశాఖ అభివృద్ధి-నిధులు-సంస్కరణలపై సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: అభివృద్ధి, నిధులు, సంస్కరణలపై ఈ నెల 29న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు పోస్టర్‌ను అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ జీఎస్ రాజేశ్వరరావు, కమిటీ సభ్యులు బుజ్జి, సీహెచ్ సత్యనారాయణ, టి.కామేశ్వరరావులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ, ఈ సదస్సులో పలువురు ప్రముఖులు ప్రసంగించనున్నారని తెలిపారు. వారిలో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్ విశ్రాంత ఆచార్యుడు ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య, విజయవాడ ఎంబీవీకే చైర్మన్ పి.మధు, ఏపీ పట్టణ పౌర సమైక్య సీహెచ్ బాబూరావు, జీవీఎంసీ సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి ఎం.వేంకటేశ్వర్లు, జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, వార్తా ప్రతినిధి ప్రకాశరావు, నివాస్ ప్రతినిధి పి.నారాయణమూర్తి ఉన్నారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో అతిపెద్ద నగరమైన విశాఖ.. రాష్ట్ర విభజన తర్వాత గత పదేళ్లలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న ఐటీ పరిశ్రమలు తరలిపోయే పరిస్థితి ఏర్పడిందని, మెట్రో రైల్ వంటివి కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. విశాఖకు వెన్నెముక వంటి స్టీల్‌ప్లాంట్‌ను సైతం అమ్మకానికి పెడుతున్నారని ఆయన విమర్శించారు. గత దశాబ్ద కాలంలో రాష్ట్ర ఖజానా నుంచి జీవీఎంసీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోగా, జీవీఎంసీ పన్నుల ఆదాయం రూ.350 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వాడుకుందని రాజేశ్వరరావు తెలిపారు. వృత్తి పన్ను ద్వారా జీవీఎంసీకి ఏడాదికి వచ్చే రూ.60 కోట్ల ఆదాయం రాష్ట్ర బడ్జెట్‌లోకి తరలిపోవడం వల్ల నిధులు లేక జీవీఎంసీ అప్పుల ఊబిలోకి కూరుకుపోతుందని చెప్పారు. దీనికి తోడు ప్రజలపై భారాలు మోపుతూ ఆస్తి విలువ ఆధారిత పన్నులు తీసుకొచ్చారని, తాగునీరు, మురుగునీరు వంటి వాటిని కూడా ప్రైవేట్‌పరం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన అన్నారు. ఈ సదస్సు ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని, నగర పౌరులు పెద్ద ఎత్తున పాల్గొని విశాఖ అభివృద్ధిపై చర్చలో పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

పర్యావరణంపైనే భవిష్యత్తు చర్చ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

అగనంపూడి: పెరుగుతున్న ఉష్ణ తాపం, మియావాకీ అరణ్య ప్రణాళిక, నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ వంటి అంశాలపైనే భవిష్యత్‌లో ప్రముఖంగా చర్చ జరగాల్సిన పరిస్థితి ఉంటుందని వైల్డ్ ఎయిడ్ వ్యవస్థాపకులు విమల్‌రాజ్, విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అన్నారు. సీఐఐ యంగ్ ఇండియన్స్ యువ ఫీచర్ 5.0 కార్యక్రమాన్ని జగ్గరాజుపేటలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో వక్తలు, విద్యార్థులు ఉష్ణతాపం, నీటి సంరక్షణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, వాటి ప్రభావాలపై అభిప్రాయాలు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఈ మూడు అంశాలు తీవ్ర రూపం దాల్చనుండడంతో వీటిపై పరిశోధనలు, చర్చలు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించగా మొదటి రెండు స్థానాల్లో విజ్ఞాన్ మహిళా కళాశాల విద్యార్థుల బృందాలు బహుమతులు దక్కించుకున్నాయి. కార్యక్రమంలో ఈస్ట్‌కోస్ట్ కన్జర్వేషన్ టీమ్ వ్యవస్థాపకులు తమరపల్లి ప్రణవ్, కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, యంగ్ ఇండియన్స్ చాప్టర్ ప్రతినిధులు బిక్కిన శ్రావణి, కొడాలి దీపా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ 42వ వార్డు అధ్యక్షుడిగా భీశెట్టి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షుడిగా భీశెట్టి ప్రసాద్ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

ప్రమాదకరంగా గొయ్యి



శంకరమఠం రోడ్‌లో ఏర్పడిన గొయ్యి

సీతంపేట: నగరంలోని శంకరమఠం రోడ్డులోని విజయగణపతి ఆలయం వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన పెద్ద గుంత వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. రాత్రివేళల్లో ఈ గుంత కనిపించక అనేక వాహనాలు స్కిడ్ అయి ప్రమాదాల బారిన పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా రోజులుగా ఈ గుంతతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. రహదారుల నిర్వహణపై జీవీఎంసీ యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే ఈ గుంతను పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల హక్కుల సాధనకు సార్వత్రిక సమ్మె



నిరసన చేపడుతున్న ఆటో కార్మికులు, చిల్లర వర్తకులు

సీతంపేట : కార్మికుల హక్కుల సాధనకు వచ్చే నెల 9న దేశ వ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద ఆటో డ్రైవర్లు, చిల్లర వర్తకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా కేంద్ర ప్రభుత్వం మార్చి కార్మికుల శ్రమను దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా రైతాంగానికి గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తూ, బడా కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచి పెడుతున్నాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే ఆటోడ్రైవర్లు అండ్ మోటార్ కార్మికులకు వాహనమిత్ర రూ.15వేలు ఇస్తామని, జరిమానాలు పెంచే జీవోలు 21, 31 రద్దు చేస్తామని, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామని, గ్రీన్ టాక్స్ రద్దు చేస్తామని హామీలు ఇచ్చారని.. ఏడాది గడిచినా ఒక్క హామీ కూడా అమలు కాలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా చంద్రబాబునాయుడు ఆటోడ్రైవర్లు, మోటారు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు జూలై 9న రాష్ట్రంలో ఆటోలు బంద్ చేసి ప్రభుత్వం కళ్లు తెరిపించాలన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు, చిల్లర వర్తకులు రావికృష్ణ, జి.నీలకంఠం, పి.సాయికుమార్, సూర్యారావు, జి.అప్పారావు, ఎం.సూర్యనారాయణ, జి.దుర్గారాజు, పి.అనిల్ పాల్గొన్నారు.

పోలీస్ ఔట్‌పోస్టులతో నేర నియంత్రణ

వెస్ట్ సబ్‌డివిజన్ ఏసీపీ పృథ్వీతేజ



రైల్వేస్టేషన్ జ్ఞానాపురం ఔట్‌గేట్ వద్ద పోలీస్ ఔట్‌పోస్టును ప్రారంభిస్తున్న ఏసీపీ పృథ్వీతేజ



ఔట్‌పోస్టు ప్రారంభించి, స్థానికులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ

తాటిచెట్లపాలెం: నేర నియంత్రణకు పోలీస్ ఔట్ పోస్టులు ఎంతగానో ఉపయోగపడతాయని వెస్ట్ జోన్ సబ్ డివిజన్ ఏసీపీ పృథ్వీతేజ తెలిపారు. జ్ఞానాపురం రైల్వేస్టేషన్ ఔట్ గేట్ సమీపంలో కంచరపాలెం పోలీసులు ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్‌పోస్టును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ రైల్వేస్టేషన్ పరిసరాల్లో నేరాలు నియంత్రించేందుకు పోలీస్ ఔట్ పోస్టు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇక్కడ షిఫ్టుల ప్రకారం రోజూ 9 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. సమీప ప్రాంతాల్లో ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంచరపాలెం పోలీస్‌స్టేషన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సమీర్, రవికుమార్, దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

జీఎం దృష్టికి ఉక్కు టౌన్‌షిప్ సమస్యలు



స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో పెరిగిపోతున్న సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని 78వ వార్డు కార్పొరేటర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. టౌన్‌షిప్ క్లస్టర్లలో జంగిల్ కటింగ్ సక్రమంగా లేకపోవడం, కటింగ్ చేసిన వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించక పోవడంతో క్వార్టర్లలోకి పాములు చొరబడి కాటు వేస్తున్నాయన్నారు. రెండు రోజుల కిందట సెక్టార్-11లో నివాసం ఉంటున్న తగరంపూడి శ్రీనివాసరావు పాము కాటుకు గురై మరణించడం బాధాకరమన్నారు. చెత్త కుండీలు క్రమం తప్పుండా శుభ్రం చేయకపోవడంతో పారిశుధ్యం లోపిస్తుందని వివరించారు. దోమలు, కీటకాల నిర్మూలన చేయాల్సిన మలేరియా విభాగం సేవలు నిలిచిపోయాయన్నారు. టౌన్‌షిప్‌లోని 56 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదని.. వాటి నిర్వహణ సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టౌన్‌షిప్‌లో హోంగార్డులను తగ్గించడం వల్ల తగిన నిఘా కొరవడిందన్నారు. టౌన్‌షిప్ నివాసుల ఆరోగ్యానికి, ప్రాణాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుల వి.వి. రమణ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు టైరుపేలి ఒకరికి గాయాలు

ఎంవీపీకాలనీ: ఇసుకతోట హైవేపై ఆర్టీసీ బస్సు టైరు పేలడంతో మామిడి వెంకటరావు(45) అనే ప్రయాణికుడు గాయపడ్డాడు. కొత్తవలసకు చెందిన వెంకటరావు ఈ నెల 22న 68కే బస్సులో ఆర్కే బీచ్‌కు బయలుదేరాడు. ఇసుకతోట కూడలి వద్ద భారీ శబ్దంతో బస్సు టైరు పేలిపోయింది. టైరుకు సమీపంలోని సీట్లో కూర్చున్న వెంకటరావుకు టైర్ భాగాలు కొన్ని తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. కేజీహెచ్‌కు తరలించారు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్టీసీ యాజమాన్యంపై బాధితుడు వెంకటరావు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.